క్లుప్తంగా

విపశ్యనా ధ్యానంపై అవగాహన



నరసరావుపేట రూరల్: రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ ఉచిత యోగ శిక్షణ శిబిరంలో గురువారం విపశ్యనా ధ్యానంపై అవగాహన కల్పించారు. డాక్టర్ వెంకటేశ్వర యోగి గురూజీ చరవాణి ద్వారా పంపించిన విపశ్యనా ధ్యానం పద్ధతులను. బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు శిబిరంలోని సాధకులచే విపశ్యనా ధ్యానాన్ని చేయించారు. ఈ సందర్భంగా శిబిరంలోని సభ్యులకు ఏరియా వైద్యశాల ల్యాబ్ టెక్నీషియన్ కొత్తపల్లి రామాంజిరెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ గురువు బండి కొండారెడ్డి, వై.నాగేశ్వరరెడ్డి, తియ్యగూర వీరారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



నరసరావుపేట టౌన్: సమాజంలో జరుగుతున్న ఆర్థిక నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని టూటౌన్ సీఐ హైమారావు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థిని శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి వాటి బారిన పడకుండా జాగ్రత్తలు పడాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఎస్‌ఐలు హరిబాబు, లేఖ ప్రియాంక సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఇక్కుర్రు సొసైటీ చైర్‌పర్సన్



నరసరావుపేట రూరల్: ఇక్కుర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్‌గా కొల్లి వెంకటేశ్వర్లు, సభ్యులుగా చెరుకూరి కావేరి, కుంభ పోలయ్యలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించిన సీనియర్ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో కంటు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బొడ్డపాటి పేరయ్య, కూరపాటి శ్రీనివాసరావు, కనుమూరు రమేష్, ఉడతా రాఘవ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండండి



నాదెండ్ల: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు, పాన్, ఆధార్ వివరాలు, ఓటీపీలు చెప్పకూడదని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. మండలంలోని గొరిజవోలు గ్రామంలో బుధవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జి.పుల్లారావు మాట్లాడుతూ రోజురోజుకు ఆన్‌లైన్, సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. తెలియని నెంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు చెప్పకూడదన్నారు. అదేవిధంగా గంజాయి, మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక, స్నేహాలను గమనిస్తూ వారు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో మత్తుపదార్థాల సరఫరా, వినియోగం చేసే వారి గురించి పోలీసులకు తెలియజేయాలని, అలా తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి ఒక్కరూ కక్షలు, రాజకీయ ప్రేరిత ఘర్షణలకు దూరంగా ప్రశాంతంగా ఉండాలని కోరారు.

ప్రాథమిక దశ నుంచే పరిశుభ్రత ఏర్పరచుకోవాలి

యడ్లపాడు: పరిశుభ్రతతోనే సగం వ్యాధుల్ని దూరం చేసుకోవచ్చని విద్యార్థులు గ్రహించాలని ఎన్ సువర్ణ కుమారి పేర్కొన్నారు. మండలంలోని కారుచోల గ్రామం జెడ్పీహైస్కూల్‌లో నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వ్యక్తిగత శుభ్రత -ఆరోగ్య భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజు స్నానం, నోరు శుభ్రం చేసుకోవడం, ఈగలు, దోమల నియంత్రణ, అవి వ్యాప్తి చేసే రోగాలు, సరైన ఆహార సమయాలు, సకాలంలో నిద్ర పోవడం తదితర అంశాలపై వివరించారు. అనంతరం ఆయా అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల్ని అందజేశారు.ఎంపీపీఎస్(ఎల్‌ఈ), జెడ్పీహైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చుతున్నారు!



సాక్షి ఎఫెక్ట్

మాచవరం గ్రామంలో 'పూడ్చని గుంతలు.. తప్పని తిప్పలు..' అనే శీర్షికతో సోమవారం ప్రచురితమైన వార్తకు జలజీవన్ మిషన్ అధికారులు స్పందించారు. సీసీ రోడ్లను పగుల గొట్టి వాటర్ పైపులు వేసిన ప్రాంతంలో అడుగుభాగంలో ఉన్న మట్టిని తొలగించి, కంకరతో పూడ్చి మరమ్మతులు చేస్తున్నారు. 40 రోజులకు పైగా పూడ్చని గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాచవరం గ్రామస్తులు వారి సమస్యలు తీరుతుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాక్షిని అభినందించారు.

–రొంపిచర్ల

ఇంత ఓర్వలేని తనమా?



వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని నివాసం వద్ద గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ నేపథ్యంలో ఆమె నివాస సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసి ఓర్వలేకపోయారు అధికార పార్టీ నాయకులు. వారి ఆదేశాల మేరకు మున్సిపల్, పోలీసు సిబ్బంది వాటిని తొలగించి స్వామి భక్తి చాటుకున్నారు. ట్రాఫిక్‌కు గాని, ఇతర ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫ్లెక్సీలను గోడల పక్కన ఏర్పాటు చేసినప్పటికీ వాటిని తొలగించటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయమై మాజీ మంత్రి విడదల రజిని తన ప్రసంగంలో వైఎస్సార్ ఫ్లెక్సీలు ముద్రించడానికి వీలులేదని ఫ్లెక్సీ యూనిట్ల యజమానులపై పోలీసులు, మున్సిపల్ అధికారులు ఒత్తిడి తెచ్చారని విమర్శించటం గమనార్హం.

–చిలకలూరిపేట

వినుకొండలో రక్తదాన శిబిరం



గుర్తింపు పత్రాలు అందిస్తున్న పార్టీ నాయకులు

వినుకొండ: గతేడాది జూన్ 17వ తేదీన హత్యకు గురైన రషీద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ పెద్ద మసీదు బజార్ షాదిఖానా ప్రక్కన రక్త దాన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి, మండల నాయకులు పాల్గొన్నారు. వారితో పాటు రషీద్ స్నేహితుడు చంటి వర్ధంతిని కలిపి నిర్వహించారు. స్నేహితులు, ఇతరులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం మీడియాతో కుటుంబ సభ్యులు, మాట్లాడుతూ హత్య జరిగిన రోజే రషీద్ సోదరుడు ఖాదర్ బాషా ఇచ్చిన ఫిర్యాదులో రషీద్ మరణానికి కారణంగా పేర్కొన్నాడని వివరించారు. వినుకొండ టీడీపీ పార్టీలోని కొందరు ప్రజాపతినిధుల పేర్లను హంతకుడు జిలానీ స్నేహితులైన కొందరు టీడీపీ రౌడీల పేర్లు ప్రస్తావించారని అయితే పోలీసులు కేవలం హత్యలో పాల్గొన్న కొందరు టీడీపీ గుండాల పేర్లు మాత్రమే పొందుపరచారన్నారు. అయితే హత్యకు కుట్రపన్నిన ప్రజాప్రతినిధులు, పట్టణ టీడీపీ ముఖ్యనేతల పేర్లు తొలగించారన్నారు. హత్య చేసింది టీడీపీ కార్యకర్తలు కావడంతో కూటమి ప్రభుత్వం కేసును నీరుగార్చేందుకు యత్నిస్తోందని మృతుడు రషీద్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. రషీద్ హత్య కేసులో అధికార పార్టీకి చెందిన కొందరిని కేసులో నుంచి బయటపడేసేందుకు టీడీపీకి అనుకూలంగా ఉన్న నలుగురు సాక్షులను పోలీసులు చేర్చి, వారి వాంగ్మూలం ఆధారంగా నలుగురు నిందితుల పేర్లు తొలగించారని రషీద్ కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ హత్యకు కుట్ర పన్నిన, హత్యలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ శిక్ష పడేలా చేసి తమకు న్యాయం చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, వైఎస్సార్ సీపీ వినుకొండ పట్టణ, రూరల్ అధ్యక్షులు... కొత్తమాసు శివ, దండు చెన్నయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గాబ్రియేల్ కౌన్సిలర్ గౌస్ బాషా, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఓటర్లకు మరో 34 పోలింగ్ బూత్‌లు

- పురపాలక ఎన్నికలకు సమాయత్తమౌతున్న అధికార గణం
- మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లు 4,222 మంది అధికం
- మహిళా ఓటర్ల చేతిలోనే అభ్యర్థుల భవితవ్యం



మున్సిపల్ కార్యాలయం

నరసరావుపేట: మున్సిపల్ ఎన్నికలకు పురపాలక అధికారులు సమాయుత్తమౌతున్నారు. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ కోర్టు వ్యాజ్యాలు, ఇతర వివాదాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన పురపాలకసంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన విషయం విదితమే. గత ప్రభుత్వంలో నరసరావుపేట పురపాలక పరిధిలో 34వార్డులుగా ఉన్న పట్టణానికి చుట్టుపక్కలనున్న ఐదు పంచాయతీలలోని ప్రాంతాలను కలిపి 38 వార్డులుగా చేసి నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిపై స్థానిక రాజకీయనాయకుల ప్రమేయంతో కొందరు రాష్ట్ర హైకోర్టు గడప తొక్కటంతో ఎన్నికల నిర్వాహణపై స్టే మంజూరైంది. అప్పటి నుంచి ఎన్నికలు నిలిచిపోయాయి. ఆ వ్యాజ్యాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మరో నెలలో అన్నీ వ్యాజ్యాలను పరిష్కరించి ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో ప్రతి పోలింగ్ బూత్‌కు 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలనే ఎన్నికల కమిషన్ సూచన మేరకు 102 బూత్‌లలో ఉన్న పట్టణ ఓటర్లను 136 బూత్‌లలోకి సర్దారు. అంటే 34 బూత్‌లను నూతనంగా ఏర్పాటు చేశారు. పట్టణ ఓటర్లు మొత్తం 1,07,351 మంది ఉండగా వారిలో పురుషులు 51,554 మంది, స్త్రీలు 55,776 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు మరో 21 మంది నమోదయ్యారు. పురుషుల కంటే 4,222 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అంటే అభ్యర్థుల విజయావకాశాలు మహిళ చేతుల్లోనే ఉన్నాయనేది స్పష్టమౌతుంది.

కాగా, వచ్చే మార్చి నాటికి ప్రస్తుత స్థానిక సంస్థల పదవీకాలం ముగియనుంది. మరో తొమ్మిది నెలల్లో ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించని పురపాలక సంఘానికి ఎన్నికలు ప్రక్రియ చేపడతారా అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ఏదిఏమైనా పట్టణంలో ఓటర్లుకు నూతనంగా మరో 34 బూత్‌లు మాత్రం ఏర్పడ్డాయి.

డిప్యూటీ ఎంపీడీవోగా సత్యనారాయణ



నూజెండ్ల: మండల పరిషత్ కార్యాలయం డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ప్రమోషన్‌పై నూజెండ్లకు రావటం జరిగిందని ఆయన తెలిపారు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులోకి వచ్చినట్లయ్యింది. ఇప్పటికే సీనియర్ అసిస్టెంట్‌గా శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ భారతి, టైపిస్టుగా మోహన్ విధుల్లో చేరారు. గతంలో కార్యాలయంలోని సిబ్బంది వివిధ కారణాలతో వెళ్లిపోవటంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ప్రభుత్వం సిబ్బంది నియామకం చేపట్టడంతో అభివృద్ధి పనులు నిరాటంకంగా జరుగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

రేపు 'మానవత' నూతన శాఖ ఆరంభం

నరసరావుపేట రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పట్టణ నూతన శాఖ ప్రారంభోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్స వం ఈనెల 19వ తేదీ శనివారం సాయంత్రం 5గంటలకు కేసానుపల్లిలోని ఎంఏఎం కళాశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, విశిష్ట అతిథిగా మానవత ఫౌండర్ ఎస్.రామచంద్రారెడ్డి, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ఎంఏఎం కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావులు పాల్గొంటారని వివరించారు. సంస్థ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తపాలా సేవలకు తాత్కాలిక అంతరాయం

నూజెండ్ల: మండల పరిధిలోని పోస్టాఫీసులో రేపటి నుంచి 22 తేదీ వరకూ ఎటువంటి లావాదేవీలు జరగబోవని నూజెండ్ల బ్రాంచ్ పోస్టుమాస్టర్ నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో ఐటీ 2.0 సాఫ్ట్‌వేర్ మారుతుండటంతో సేవలకు అంతరాయం జరుగుతుందన్నారు. 23వ తేదీ నుంచి వినియోగదారులు యథావిధిగా లావాదేవీలు జరుపుకొవచ్చని తెలిపారు. ఈ మార్పును గమనించి కస్టమర్లు సహకరించాలని కోరారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలోని ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. దీంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. 2015–16 సంవత్సరంలో నిర్మించారని, అప్పట్లో నిర్మాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుపోవటంతో మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారు. ఈ సెంటర్లో 15 మంది చిన్నారులు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తీసుకుంటారు. వర్షాలు పడుతున్న వేళ బిల్డింగ్ స్లాబు కారడం వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు వాపోతున్నారు. ఈవిషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను వివరణ కోరగా అప్పట్లో భవన నిర్మాణం సరిగ్గా చేపట్టపోవటం వల్ల స్వల్ప మరమ్మతులు చేయాల్సి ఉందని, దీనిపై ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అధికారులు చర్యలు చేపట్టి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల పెరుగుదలకు ఉపాధ్యాయులదే కీలకపాత్ర

డీఈవో చంద్రకళ



శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్న సంసిద్ స్కూల్లో జిల్లా స్థాయిలో 227 మంది ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయాభావం, క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను విద్యార్థులకు బోధించాలన్నారు. 60 మంది విద్యార్థుల సంఖ్య దాటిన ప్రైమరీ స్కూల్స్ జిల్లాలో 463 ఉండగా ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు పర్యవేక్షణలో ప్రత్యేకంగా బోధిస్తున్నారన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవటం ద్వారా ప్రతి పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతం నూరుశాతం పెరుగుతుందన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రతి విద్యార్థి చదవటం రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలను చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉపాధ్యాయులు దృష్టిలో ఉంచుకుని తగినరీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి సుభాని, ఎంఈవో పుసులూరి లలితకుమారి, ఏఎంవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి సుపరిపాలనలో తొలి తప్పటడుగు

జిల్లా కమిటీ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: కేవలం ప్రచార ఆర్భాటం కోసమే కుటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు అంటూ ప్రచారం చేస్తున్నారని అది ఒక తప్పటడుగని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో బాబూరావు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. దీంతోపాటు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని వెల్లడించారు. విద్యుత్ చార్జీల పెంపు విషయంలో మరింత మోసపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఒకవైపు చార్జీలు పెంచుతూ రూ.450 కోట్ల సర్దుబాటు చార్జీలు వెనక్కి ఇస్తున్నామని బూటకపు మాటలు చెబుతున్నారని అన్నారు. ఏడాది కాలంలో నాలుగు రకాల సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,485 కోట్లతో పాటు యూనిట్‌కు అదనంగా 40 పైసలు వసూలు వంతున ఏడాది కాలంలో రూ.2787కోట్లు వసూలు చేసి ఆషాఢం ఆఫర్ మాదిరి రూ.450 కోట్లను వెనక్కు ఇస్తున్నామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. స్మార్ట్‌మీటర్ల ప్రక్రియ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశించారని, గత ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.రాధాకృష్ణ, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి పాల్గొన్నారు.

కారంచేడు దళిత మృతవీరుల్ని స్మరించుకుందాం

కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ



డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాచైతన్య యాత్రలో కేఎన్‌పీఎస్ కృష్ణ.

నరసరావుపేట: కారంచేడు నరమేధానికి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆగస్టు ఆరు చుందూరు వరకు దళిత మృతవీరుల్ని స్మరించుకుంటామని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. గురువారం గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజా చైతన్యయాత్ర ప్రారంభించారు. కృష్ణ మాట్లాడుతూ కారంచేడు నరమేథం జరిగిన నాటికి నేటికీ అగ్రకుల ఆధిపత్య కులాల శక్తుల చేతుల్లో ప్రతినిత్యం ఏదో ఒక చోట దళిత, పీడిత కులాల ప్రజలు దాడులు, హత్యలు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులతో పాటు ప్రజాస్వామికవాదులు, ఉద్యమ సంఘాలు పాల్గొని విజయవంతం చేయా లని విజ్ఞప్తి చేశారు. కారంచేడు దళిత మృతవీరులకు నివాళులు అర్పించిన అనంతరం పట్టణంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్న ప్రసాదు, జిల్లా సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్.రాజశేఖర్, పీడీఎం సీనియర్ నాయకుడు నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాస రావు, సామాజిక కార్యకర్త కృష్ణానాయక్, కేఎన్‌పీఎస్ సభ్యులు సుజాత ఉన్నారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో...



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

చిలకలూరిపేట: బదిలీ పొందిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలని రాష్ట ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్టీయూ సమావేశం గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సర్దుబాటు జరిగి నెల కావస్తున్నా జీతాల సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. దీంతో జూన్ జీతాలు ఇంకా జమ కాలేదన్నారు. బదిలీలకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతితో పొజిషన్ ఐడీ క్రియేట్ చేయడంతో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. డీఎస్సీ–2003 కు చెందిన వారు ఓపీఎస్ సాధనకు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎస్టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రాల్లో ఓపీఎస్ సాధన కోసం నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు వి.అక్కయ్య, సీహెచ్ మల్లేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, వి.అజయ్‌ప్రకాశ్, వి.రవి, సీహెచ్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ యువ స్కిల్ డే

వినుకొండ: స్థానిక గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం నెహ్రూ యువ కేంద్రం గుంటూరు వారి సహకారంతో నేచురల్ హెల్త్ కేర్ సెక్రటరీ యన్. భగవాన్ దాస్ ఆధ్వర్యంలో ప్రపంచ యువ స్కిల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ దాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు అదనపు స్కిల్స్ కూడా నేర్చుకోవాలని అందులో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం, చిత్రలేఖనం, ఏఐ కోర్సులు, స్పోర్ట్స్ మొదలైనవి నేర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు జి. కమలారామ్, భాగవతుల రవికుమార్, డి. శివఫణీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



బొల్లాపల్లి: పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వాటిలోని రాగివైరు చోరీతో రైతులు ఆందోళన గురవుతున్నారు మండలంలోని అయ్యన్నపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని పొలాల్లో గత వారం రోజులుగా 8 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి అందులోని రాగి వైరుతోపాటు మరికొన్ని ఉపకరణాలను అపహరించారు దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తరచుగా మండలంలోని రేమిడిచర్ల సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని వస్తువులను చోరీకి పాల్పడటం జరుగుతుందని దీనిపై విద్యుత్ శాఖ, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని రైతుల ఆవేదన.

మద్యం దుకాణాల పరిధిలో డెకొయ్ ఆపరేషన్



బొల్లాపల్లి: ఈపూరు, బొల్లాపల్లి మద్యం దుకాణాలు వద్ద 'డెకొయ్ ఆపరేషన్ ను నిర్వహించారు. అలాగే ఈపూరులోని జనతా వైన్స్, బొల్లాపల్లి మండలంలోని పరమేశ్వరి వైన్స్, గణేష్ వైన్స్, వెంకటేశ్వర వైన్స్ మద్యం దుకాణాల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన విజిలెన్స్

రొంపిచర్ల: మండలంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ ఇంటర్నల్ స్క్వాడ్ గురువారం తనిఖీలు నిర్వహించింది. తనిఖీల్లో భాగంగా రొంపిచర్లలోని జీడీసీఎంఎస్ బ్రాంచ్‌లో ధరణి ఏజెన్సీలో తనిఖీలు చేశారు. స్టాక్ రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిపోర్ట్‌కు ఈ–పాస్ మిషన్‌లో ఉన్న స్టాక్‌కు వ్యత్యాసం ఉండకూడదన్నారు. గోడౌన్‌లో ఉన్న ఎరువుల బస్తాలను స్టాక్ రిజిస్టర్, ఈ–పాస్ మిషన్ లోని స్టాక్‌లతో పరిశీలించారు. రైతులకు కావల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని అధికారులు నిర్వాహకులకు సూచించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాలమేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఏలూరు జిల్లా కోటరామచంద్రాపురం ఏడీఏ బుజ్జిబాబు, విజయవాడ విజిలెన్స్ విభాగం సీఐ మహ్మద్ ఉమ్మర్, వ్యవసాయ అధికారులు సుబ్బారెడ్డి, శివలలితలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం: పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. మండలంలోని వయ్యకల్లు గ్రామపంచాయతీ కార్యదర్శిగా డి.ధర్మారాజు, కొత్తలూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా బి.వెంకటరావు, బొందిలిపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బి.అరుణ్‌భారతిలు ఫిరంగిపురం మండలం నుంచి సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



వినుకొండ: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సంఘం కార్యాలయ ఆవరణలో పుట్టంరాజు రంగనాయకమ్మ జ్ఞాపకార్థం కుమారుడు నారాయణరావు, బేబీ సరోజిని దంపతులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి శేషసాయి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా సంఘ సభ్యుల సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జి. నాగేంద్రుడు, గోపిచంద్, బీపీఎస్ సుందరరావు, వై.వి.సుబ్బయ్య శర్మ, అవ్వారు కోటేశ్వరరావు, ఎం.వి.శర్మ, సుబ్రహ్మణ్యం, శంకరరావు, దీక్షతులు, నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రమేష్ సేవలు అభినందనీయం

శావల్యాపురం: కుప్పం ద్రవిడ్ యూనివర్సిటీలో డిగ్రీ పీజీ విద్యార్థులకు ఆంగ్ల చేతిరాతపై శిక్షణ ఇచ్చిన వినుకొండ వాసీ బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు కో ఆర్డినేటరు చేకూరి రమేష్ అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్ చంద్రకళ అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి సంసిత్ స్కూల్లో జరిగిన లీడర్ షిప్ శిక్షణ తరగతులకు పాల్గొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు బెజవాడ చారిట్రబుల్ చైర్మన్ బెజవాడ వెంకట నాగేశ్వరరావు,ఎస్టీయూ రాష్ట్ర నాయకులు జోసఫ్‌సుదీర్‌బాబు,ఎంఈవో పి.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో అధునాతన సేవలు

- 19 నుంచి 21వ తేదీ వరకు సేవలు నిలిపివేత
- 22 నుంచి సేవలు పునః ప్రారంభం

నరసరావుపేటటౌన్: వినియోగదారులు ఇంటి నుంచే సేవల్ని పొందేలా ఈ నెల 22వ తేదీ నుంచి అధునాతన తపాలా సాంకేతికత విధానాన్ని అమలు చేయనున్నట్లు తపాలా శాఖ నరసరావుపేట డివిజన్ సూపరింటెండెంట్ మొహమ్మద్ జాఫర్ సాదిక్ గురువారం తెలిపారు. సేవల్లో సామర్థ్యం పెంపు, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీల నిర్వహణతో పాటు మెరుగైన ట్రాకింగ్‌తో వినియోగదారులకు సేవల్ని అందించడం నూతన సేవల ఉద్దేశం అన్నారు. నరసరావుపేట డివిజన్ పరిధిలోని 449 తపాలా కార్యాలయాల్లో ఈ విధానం అమలవుతుందని తెలిపారు. నూతన సంస్కరణలో భాగంగా ఈ నెల 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు తపాలా కార్యాలయాల్లో సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వివరించారు. తేదీ 22.07.2025 నుండి తపాలా కార్యాలయాల్లో సేవలు పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.